సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 4 । జనవరి । 2023




కలువ పూల అందాలు..

కలువ పూల వనమా.. నీ అందమంతా కనుమా..నీటిపై హొయలొలుకుతూ.. నిండుగా విరబూసిన తెల్లదనమా.. హసన్‌పర్తి మండలం గుంటూరుపల్లి చెరువునిండా కలువ పూలు విరబూసి ఆ చెరువుకు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

న్యూస్‌రీల్

గ్రూప్-4 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కాజీపేట అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-4 పోటీ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కందాల శంకరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 0870-2571192 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గురుకులం తనిఖీ



న్యూశాయంపేట: వరంగల్ నగర శివారు జక్కలొద్ది మైనారిటీ గురుకులాన్ని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ జడ్జి జె.ఉపేందర్ మంగళవారం భోజన విరామ సమయంలో తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, డైనింగ్ హాల్, కిచెన్‌లను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందిస్తున్నారా అని ప్రిన్సిపాల్ భిక్షపతిని అడిగి తెలుసుకున్నారు. టీచింగ్ స్టాఫ్‌తో ఇంటరాక్ట్ అయి సిలబస్ పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట కళాశాల కో-ఆర్డినేటర్ ఆయేషా ఉన్నారు.

5 నుంచి గ్రామీణ ఉత్పత్తుల కళామేళా

హన్మకొండ: హనుమకొండ రామకృష్ణ కాలనీలోని తారా గార్డెన్‌లో ఈ నెల 5నుంచి 8వ తేదీ వరకు కాకతీయ గ్రామీణ ఉత్పత్తుల కళామేళా నిర్వహిస్తున్నట్లు నాబార్డ్ వరంగల్ డీడీఎంలు చంద్రశేఖర్, చైతన్య రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించి వాటిని మార్కెటింగ్ చేసేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 70 స్వయం సహాయక మహిళా సంఘాలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. నగరవాసులు ప్రదర్శనను తిలకించి నచ్చిన వస్తువులు కొనుగోలు చేసి మహిళలకు చేయూతనివ్వాలని కోరారు.

'కంటి వెలుగు'కు సిద్ధం కావాలి

మంత్రి హరీశ్‌రావు

హన్మకొండ అర్బన్/కరీమాబాద్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సిద్ధం కావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వీసీలో హనుమకొండనుంచి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు. వరంగల్ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ గోపి, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విందులో ఇక మందు కుదరదు..!

ఎక్సైజ్ నిబంధనలు కఠినతరం?

కాజీపేట: బహిరంగ ప్రదేశాలతోపాటు విందులు, వినోదాలు జరిగే ఫంక్షన్ హాల్స్‌లో ఇకనుంచి మద్యం సేవించడం కుదరదు. ముందస్తు అనుమతులు లేకుండా ఫంక్షన్ హాల్స్‌లో మద్యం తాగడం నేరంగా ఎక్సైజ్ అధికారులు పరిగణించనున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందితే ఆకస్మికంగా దాడులు చేసి పట్టుకునే అవకాశం ఉంది. ఫంక్షన్ హాల్స్‌లో మద్యం తాగుతున్నా.. తాగినట్లు అధికారులు భావించినా వేడుకల నిర్వాహకులతోపాటు హాల్ యజమానిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఈ మేరకు గ్రేటర్ పరిధిలోని ఫంక్షన్ హాళ్ల వివరాలను సిబ్బంది సేకరించి పెట్టుకున్నారు. ఎక్సైజ్ శాఖకు చలానా చెల్లించి అనుమతి పత్రం ఆధారంగా మద్యం తాగడానికి అవకాశం ఇస్తారని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

అధ్యయనం.. సమన్వయలోపం!

- కమిషనరేట్ పరిధిలో ప్రమాదాల నివారణకు శాఖల మధ్య లేని స్పష్టత
- రోడ్డు సేఫ్టీ కమిటీ ఉన్నా పని అంతా పోలీసులదే..
- మిగిలిన విభాగాల అధికారులు స్పాట్‌కు రావడంపై అనాసక్తి
- ఫలితంగా బ్లాక్ స్పాట్‌లకు మరమ్మతు చేపట్టని వైనం
- సీపీ ఏవీ రంగనాథ్ దృష్టి సారించాలంటున్న సిబ్బంది



హనుమకొండ అలంకార్ జంక్షన్‌లో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

సాక్షి, వరంగల్: 'రోడ్డు ప్రమాదాల నియంత్రణకు నిరంతరం కృషి చేస్తున్నాం.. ఇందులో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చలాన్ల రూపంలో జరిమానాలు విధిస్తున్నాం..' అధికారులు తరచూ చెప్పే మాటలివి.. ఇదంతా బాగానే ఉన్నా.. రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాల్లో అందుకు గల కారణాలను అధ్యయనం చేసే రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యుల బృందం మధ్య సమన్వయలేమి వల్ల బ్లాక్ స్పాట్‌లు మరమ్మతుకు నోచుకోవడం లేదు. దీనికితోడు ఆయా రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను పోలీసులే తెలుసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. రోడ్డు సేఫ్టీ కమిటీలో సభ్యులుగా ఉండే మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, వైద్యాధికారి, ఆర్ అండ్‌బీ, హైవే, పంచాయతీరాజ్ ఇంజనీర్, సంబంధిత పోలీసుల్లో ఎవరో ఒకరు ఘటనాస్థలికి రాకపోవడంతో పూర్తిస్థాయిలో ఆ ప్రమాద నివేదికపై స్పష్టత కొరవడుతోంది. ఫలితంగా ప్రమాదానికి కారణం ఏమిటనే దానిపై సరైన క్లారిటీ లేకపోవడంతో బ్లాక్ స్పాట్‌లు మరమ్మతు కాని పరిస్థితి ఏర్పడుతోందనే టాక్ వస్తోంది. దీనిపై కొత్తగా వచ్చిన పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టి సారించి.. రోడ్డు సేఫ్టీ కమిటీని యాక్టివ్ చేయాలంటున్నారు.

అధ్యయనం చేస్తే మంచి ఫలితాలే..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా రోడ్డు సేఫ్టీ కమిటీ బృందం వెళ్లి లోతుగా అధ్యయనం చేయాలి. అది మానవ తప్పిదం వల్ల జరిగిందా.. రోడ్డు బాగా లేకనా.. రాత్రి సమయాల్లో వెలుతురు లేకపోవడం వల్ల డివైడర్లకు ఢీకొట్టాడా.. సిగ్నల్స్ లేకపోవడం కారణమా.. రోడ్డు ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవా.. ఇంజనీరింగ్ తప్పిదమా.. వాహన సమస్యా తదితరాలు ఈ బృందం అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేస్తుంది. ఏ కారణం చేత అక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో తెలుసుకుని మరమ్మతు కోసం సంబంధిత విభాగానికి లేఖ రాస్తుంది. ఉదాహరణకు.. ఆ ప్రాంతంలో చీకటిగా ఉండడం వల్లే ప్రమాదం జరిగితే అక్కడ లైట్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖకు లేఖ రాస్తుంది. రోడ్డు బాగా లేకపోతే.. సంబంధిత విభాగ ఇంజనీరింగ్ అధికారులకు లేఖ రాస్తుంది. అలాగే కలెక్టర్ చైర్మన్‌గా ఉండే రోడ్డు సేఫ్టీ కమిటీ ప్రతీ మూడు నెలలకు ఒకసారి సమావేశమై రోడ్డు ప్రమాదాల నియంత్రణపై చర్చించాల్సి ఉంది.

ఎక్కడెక్కడ బ్లాక్ స్పాట్‌లంటే..

మట్టెవాడ, ఏజే మిల్స్ కాలనీ, ఇంతేజార్‌గంజ్, కాకతీయ యూనివర్సిటీ, సుబేదారి, హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి, మడికొండ, దామెర, మామునూరు, జనగామ, ఘన్‌పూర్, లింగాల ఘన్‌పూర్, వర్ధన్నపేట.

మచ్చుకు కొన్ని..

- హనుమకొండ మార్కజీ సెంటర్ నుంచి అలంకార్ సెంటర్ వరకు మీడియన్స్‌లో రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. అలంకార్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పెట్టాలి. రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను నిరోధించేందుకు ఎంట్రీ పాయింట్ల వద్ద ఫ్లెక్సీలు, సూచికలు అమర్చాలి. ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో గతేడాది మార్చి ఒకటిన నివేదిక రూపొందించి సంబంధిత విభాగానికి పంపినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.
- వడ్డెపల్లి క్రాస్ రోడ్డు నుంచి జులైవాడ క్రాస్ మార్గంలో వాహన వేగ పరిమితి బోర్డులు ఏర్పాటు చేయాలి. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ముందు సోలార్ బ్లింకర్స్ పెట్టాలి. రోడ్లపై వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలి. వీటన్నింటిపై అధ్యయనం చేసి గతేడాది మార్చిలో నివేదిక ఇచ్చినా ఇప్పటికీ బల్దియా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.
- వరంగల్ పోస్టాఫీసు నుంచి పోచమ్మమైదాన్ మధ్యలో ఉన్న వరంగల్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినా ఇంకా మొదలుకాలేదు. దీనివల్ల సిగ్నల్స్ జంపింగ్ తగ్గి ప్రమాదాలు తగ్గే అవకాశమున్నా ఆ దిశగా అధికారులు చూడడం లేదు.

వరంగల్ కమిషనరేట్ పరిధిలో 2022లో రోడ్డు ప్రమాదాలిలా...

ప్రాంతం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
జాతీయ రహదారులు	533	200	535
రాష్ట్ర	29	6	31
అంతర్గత	563	218	536

రిజిస్ట్రేషన్లు భళా.. కాసుల గలగల!

ఉమ్మడి వరంగల్‌లో 'రియల్'ఊపు

- కాసులు కురిపించిన 'రిజిస్ట్రేషన్లు'
- 2022లో రూ.404 కోట్ల ఆదాయం
- 2021తో పోలిస్తే రూ.114 కోట్లు అధికం
- మొదటి స్థానంలో వరంగల్ కార్యాలయం



సాక్షిప్రతినిధి, వరంగల్: ఓరుగల్లు నగరం చుట్టూ రియల్ దందా ఊపందుకుంది. హైదరాబాద్‌కు దీటుగా భూక్రయవిక్రయాలు సాగుతున్నాయి. ప్రభుత్వానికి మూడో ఖజానాగా పేరుగాంచిన రిజిస్ట్రేషన్ల శాఖపై కాసుల వర్షం కురుస్తోంది. రిజిస్ట్రేషన్‌శాఖ అధికారుల వివరాల ప్రకారం... 2022లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా రూ.404 కోట్ల ఆదాయం సమకూరింది. ఏడాదిలో 1,05,954 దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. 2021లో 97,526 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ ద్వారా రూ.290 కోట్ల ఆదాయం రాగా, తన రికార్డు తానే తిరగరాస్తూ 2022లో రూ.404 కోట్ల ఆదాయాన్ని ఖజానాకు అందజేసింది. గతేడాది ఆదాయంతో పోలిస్తే రూ.114 కోట్లు అదనంగా వచ్చాయి.

టాప్‌లో వరంగల్ ఆర్వో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12రిజిస్ట్రేషన్ కార్యాలయాలు (భీమదేవరపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ, కొడకండ్ల, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పరకాల, వర్ధన్నపేట, వరంగల్, వరంగల్ రూరల్, ఫోర్ట్ వరంగల్) ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో రూ.217కోట్ల ఆదాయంతో వరంగల్ ఆర్వో టాప్‌లో నిలిచింది.

జనవరి నుంచి డిసెంబర్ వరకు దస్తావేజులు, ఆదాయం (రూ.కోట్లలో)

	2021		2022	
కార్యాలయం	దస్తావేజులు	ఆదాయం	దస్తావేజులు	ఆదాయం
భీమదేవరపల్లి	4,221	9	4,164	10
స్టేషన్ ఘన్‌పూర్	3,598	6	4,944	12
జనగామ	8,569	14	12,164	30
కొడకండ్ల	1,287	2	1,405	2
మహబూబాబాద్	15,219	27	16,381	38
ములుగు	8,839	13	10,573	22
నర్సంపేట	5,108	8	5,482	12
పరకాల	2,421	5	2,548	8
వర్ధన్నపేట	1,327	2	1,388	2
వరంగల్ రూరల్	2,559	6	2,960	9
వరంగల్ ఆర్వో	32,319	165	32,701	217
వరంగల్‌ఫోర్ట్	12,059	33	11,244	42

నాణ్యత లేకపోతే బిల్లుల్లో కోత

బల్దియా కమిషనర్ ప్రావీణ్య



వాజ్‌పేయి కాలనీలోని వైకుంఠధామం పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించకపోతే బిల్లుల్లో కోతలు తప్పవని గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య హెచ్చరించారు. బల్దియా పరిధిలోని పలు డివిజన్‌లలో పూర్తయిన అభివృద్ధి పనులను మంగళవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. తొలుత 57వ డివిజన్ వాజ్‌పేయి కాలనీలో నిర్మించిన మోడల్ వైకుంఠధామాన్ని పరిశీలించారు. ఫినిషింగ్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ, కాకతీయ యూనివర్సిటీ 100 ఫీట్ల రోడ్ బైపాస్, కొత్తూర్ జెండా, కుమార్‌పల్లి, కిషన్‌పుర ప్రాంతాల్లో నిర్మించిన అంతర్గత రహదారులు, మురుగు కాలువలను సందర్శించారు. అనంతరం 'కుడా' ఆధ్వర్యంలో బాలసముద్రం కుడా (హయగ్రీవాచారి) స్థలానికి ఏర్పాటు చేసిన ప్రహరీ, జైన్ గుట్ట వద్ద అభివృద్ధి పనులు, పద్మాక్షి గుండంలో గుర్రపు డెక్క తొలగింపు, నీటి పరిశుభ్రతను పరిశీలించి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట బల్దియా ఈఈలు రాజయ్య, భీంరావు, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, డీఈ రవికుమార్, ఏఈ హరి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న జీవన సౌలభ్య సర్వే



సర్వేపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వరంగల్ అర్బన్: కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న జీవన సౌలభ్య (సిటిజన్ పర్సెప్షన్) సర్వే నగర వ్యాప్తంగా కొనసాగుతోంది. మంగళవారం శానిటేషన్, మెప్మా సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. సర్వేలో పాల్గొనడానికి ఈ నెల 7వ తేదీ తుది గడువు ఉన్నందున ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న నగర వాసులు eol2022.org// లింక్ ద్వారా లాగిన్ అయి నగర స్థితిగతులపై అందులో పేర్కొన్న వాటికి సమాధానాలు ఇవ్వాలని కోరారు.

మహనీయులను కొన్ని వర్గాలకే ఆపాదించొద్దు

ప్రభుత్వ చీఫ్‌విఫ్ దాస్యం వినయ్‌భాస్కర్



జ్యోతిరావు పూలే రీసెర్చ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే నరేందర్, వీసీ రమేశ్ తదితరులు

కేయూ క్యాంపస్: మహనీయులను కొన్ని వర్గాలకే ఆపాదించొద్దని ప్రభుత్వ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం కేయూలోని సెనెట్‌హాల్‌లో వీసీ తాటికొండ రమేష్ అధ్యక్షతన జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి సభలో ఆయన మాట్లాడారు. విద్యతోనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. గొప్ప స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయి పూలే అని, వారి గొప్పతనాన్ని రాబోయే తరానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే నరేందర్, రిటైర్డ్ ప్రొఫెసర్ మురళి మనోహర్, ఎన్ఐటీ ప్రొఫెసర్ వలపుదాసు రమ, టి.శ్రీనివాసరావు, బి.నాగరాజు, యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు నాగేంద్ర బాబు, మనోహర్, పి.మల్లారెడ్డి, డాక్టర్ గుండాల మదన్ కుమార్, డాక్టర్ బి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు దూరవిద్య కేంద్రం ప్రాంగణంలోని పూలేదంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఆడిటోరియంలో కొత్తగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్‌ఫర్ రీసెర్చ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యేలు, వీసీ ప్రారంభించారు.

ఈవీఎంలు భద్రపరిచే గోదాముల పరిశీలన




గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్లు గోపి, రాజీవ్‌గాంధీ హన్మంతు


వరంగల్ రూరల్: ఈవీఎంలను భద్రపరిచే వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని గోదాములను వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ బి.గోపి, రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం పరిశీలించారు. గోదాం నం.9ఏ, 9బీలుగా విభజించి ఈవీఎంలను భద్రపరచగా.. నెలవారీ తనిఖీల్లో భాగంగా కలెక్టర్లు తనిఖీ చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కొత్తగా మరికొన్ని ఈవీఎంలు రానుండడంతో మిర్చి యార్డు పక్కనే ఉన్న గోదాం నం.8, 10లను కూడా కేటాయించాలని మార్కెట్ కార్యదర్శి రాహుల్‌ను ఆర్డీఓలు మహేందర్ జీ, వాసుచంద్ర కోరగా.. ఆయన సుముఖత వ్యక్తం చేశారు. దీంతో కొత్తగా కేటాయించనున్న గోదాంలలో ఈవీఎంలు భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేయాలని మార్కెట్ అధికారులను కోరారు. కలెక్టర్ల వెంట వరంగల్ ఆర్డీఓ సీహెచ్.మహేందర్ జీ, హనుమకొండ ఆర్డీఓ వాసుచంద్ర, వరంగల్ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పాలకుర్తి ప్రసాదరావు, హనుమకొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, వరంగల్ తహసీల్దార్ సత్యపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'హద్దులు' మీరారు.. వేటుకు గురయ్యారు!


- మహిళా ఎస్ఐ, ఓ సీఐతో ప్రేమ వ్యవహారం
- గమనించిన భర్త.. సీపీకి ఫిర్యాదు
- లైంగిక వేధింపులతో స్టేషన్‌కు వచ్చిన యువతికి మరో ఎస్ఐ ఉచిత సలహా
- సీరియస్‌గా పరిగణించి ముగ్గురిని సస్పెండ్ చేసిన సీపీ రంగనాథ్
- నెల రోజుల్లోనే మార్క్ చూపించిన పోలీస్ కమిషనర్



దామెర ఎస్ఐ హరిప్రియ



గీసుకొండ సీఐ వెంకటేశ్వర్లు



సుబేదారి ఎస్ఐ పున్నంచందర్

వరంగల్ క్రైం: మహిళా ఎస్ఐ పెళ్లయి నెలరోజులైంది. కానీ అంతకుముందు ఉన్న పరిచయం కారణంగా ఓ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి 'హద్దులు'మీరింది. వీరి ప్రేమ వ్యవహారం భర్తకు తెలియడంతో బట్టబయలైంది. అదేవిధంగా లైంగిక వేధింపులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన యువతిని మరో ఎస్ఐ.. పట్టించుకోకుండా రాజీపడాల్సిందిగా ఉచిత సలహా ఇచ్చాడు. వీరి చర్యలను సహించని సీపీ రంగనాథ్ మంగళవారం ముగ్గురిపై సస్పెన్షన్ వేటు వేశారు. కమిషనరేట్ పరిధిలో ఇక ఏమి జరిగినా కఠిన చర్యలు తప్పవన్న సంకేతం ఇచ్చారు. వచ్చిన నెలరోజుల్లోనే దిద్దుబాటు చర్యలకు దిగడంతో నిబంధనలు అతిక్రమించే పోలీసుల్లో భయం పట్టుకుంది.

క్రమశిక్షణకు మారుపేరు పోలీస్ శాఖ. కానీ కొంతమంది అధికారులు హద్దు మీరి ప్రవర్తించడం ఆ శాఖకు తలవంపులు తెచ్చిపెడుతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గీసుగొండ ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు, దామెర సబ్ ఇన్‌స్పెక్టర్ హరిప్రియలు హద్దు మీరి ప్రవర్తించడంతో ఇరువురిని సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేయడం కమిషనరేట్ పరిధిలో సంచలనం కలిగించింది. ఎస్ఐ హరిప్రియకు ఇటీవల పెళ్లయ్యింది. కానీ.. ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు, ఎస్సై హరిప్రియ మధ్య కొంత కాలంగా ప్రేమాయణం సాగుతోంది. ఆమె ప్రవర్తనపై భర్తకు అనుమానం రావడంతో ఫోన్‌లో వాట్సాప్ చాటింగ్ గమనించాడు. దీని ఆధారంగా సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో విచారణ చేపట్టిన సీపీ.. వాస్తవమని తేలడంతో సస్పెన్షన్ వేటు వేశారు.

రాజీ కుదుర్చుకోండని ఉచిత సలహా..

సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.పున్నంచందర్ ఓ యువతి ఫిర్యాదు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆయనపై వేటు పడింది. స్టేషన్ పరిధిలో ఉండే ఓ యువతి కొంత కాలంగా లైంగిక వేధింపులకు గురై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించాల్సిన ఎస్సై పున్నంచందర్ నిందితుడిపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతోపాటు రాజీ పడాలని ఉచిత సలహా ఇచ్చాడు. దీంతో బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసిన అధికారులు సీపీకి నివేదిక సమర్పించారు. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నెల రోజుల్లో ఐదుగురిపై వేటు..

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా డిసెంబర్ 3న బాధ్యతలు స్వీకరించిన సీపీ రంగనాథ్.. నెల రోజుల్లోనే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఐదుగురిపై వేటు వేయడం కమిషనరేట్‌లో కలకలం సృష్టిస్తోంది. కొద్ది రోజుల క్రితం ఓ దొంగతనం విషయంలో ఓ నిందితుడిని అదుపులోకి తీసుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా దొంగ పరారయ్యాడు. ఈ వ్యవహారంలో కానిస్టేబుల్ మోహన్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడగా, అడ్మిన్ ఎస్సై సంపత్‌ను ఏఆర్‌కు అటాచ్ చేశారు. తాజాగా ముగ్గురిని సస్పెండ్ చేశారు.



బాణసంచా కాలుస్తున్న యువకులు

గీసుకొండ మండలంలో సంబరాలు

గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు పడిందన్న సమాచారంతో గీసుకొండ మండలం మణుగొండ, కొమ్మాలగ్రామాల్లో యువకులు బాణసంచా కాల్చి సీపీ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

గతంలోనూ ప్రేమాయణాలు..

కమిషనరేట్‌లోని పోలీస్ అధికారుల ప్రేమాయణాలు కొత్తేమి కాదు. మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు సీబీసీఐడీలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్‌పై సుబేదారి పోలీసులు అక్రమాస్తులు, నేరపూరిత బెదిరింపుల కింద కేసు నమోదు చేశారు. సీబీ సీఐడీ ఇన్‌స్పెక్టర్, రవి, తన మహిళా సహోద్యోగి అయిన ఇన్‌స్పెక్టర్‌తో కలిసి హనుమకొండలోని రాంనగర్‌లోని ఆమె ఇంట్లో ఉండగా భర్త అయిన మహబూబాబాద్ సీఐ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీబీసీఐడీ ఇన్‌స్పెక్టర్, మహిళా ఇన్‌స్పెక్టర్ వివాహేతర సంబంధం పెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం
రైతు సంఘాలపై బెదిరింపులను సహించేది లేదు
ఘనంగా యువజనోత్సవం
- వివరాలు 10లో ▸

రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య

సంగెం: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో తాను కుటుంబానికి భారం కాకూడదని జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలం కుంటపల్లి గ్రామానికి చెందిన రాగిరి శివారెడ్డి(58)కి భార్య విజయలక్ష్మి, కూతురు కావ్య ఉన్నారు. కూతురు వివాహం జరిపించాడు. కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్న శివారెడ్డి ఎలాంటి పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీనికితోడు ఆర్థిక సమస్యలు వెంటాడాయి. ఆర్థిక సమస్యలు, తన అనారోగ్యం కుటుంబానికి భారం కాకూడదని జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం చింతలపల్లి - ఎల్గూర్ స్టేషన్ల మధ్య సంగెం గేట్ సమీపంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ హెచ్‌సీ సాయిప్రసాద్ తెలిపారు.

కోమటిపల్లి-హసన్‌పర్తి రైల్వేస్టేషన్ల మధ్య ఒకరు..

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమటిపల్లి - హసన్‌పర్తి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన శివరాత్రి సతీష్(29) ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాతాల నర్సయ్య(49) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్లుగా ఆరోగ్యం సహకరించకపోవడంతో కూలీ పనులకు వెళ్లడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టి జీవితంపై విరక్తి చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

తుది పరీక్షకు రెడీ

కేయూ మైదానంలో ముగిసిన పోలీస్ దేహదారుఢ్య పరీక్షలు

● మెయిన్స్‌కు 12,387 మంది అర్హత


అదనపు డీసీపీ వైభవ్ గైక్వాడ్‌కు అభినందన పత్రం అందజేస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మైదానంలో నిర్వహించిన స్టయిఫండరీ సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 8 నుంచి మంగళవారం వరకు ఈవెంట్స్ కొనసాగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 24,612 మంది అభ్యర్థులు ఫిజికల్ ఈవెంట్లలో పాల్గొనేందుకు అడ్మిట్ కార్డులు జారీ చేశారు. వారిలో 21,585(88 శాతం) మంది దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. తుది పరీక్షకు 12,387(57.03 శాతం) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. కాగా, 4,784 మహిళా అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా 4,458 మంది ఈవెంట్స్‌కు హాజరయ్యారు. వారిలో 3,283 మంది అర్హత సాధించారు. ఇక పురుషులు 17,127 మంది హాజరుకాగా, 9,104 మంది తుది పరీక్షకు అర్హత ఎంపికయ్యారు. ఈవెంట్స్ ముగిసిన అనంతరం విధుల్లో పాల్గొన్న అధికారులకు సీపీ ఏవీ రంగనాథ్ అభినందన పత్రాలు అందజేశారు.

ఉదయం 5 గంటల నుంచే..

కేయూ మైదానంలో నిర్వహించిన ఈ పోలీస్ ఈవెంట్స్ ప్రతి రోజు ఉదయం 5 గంటలకే ప్రారంభమయ్యాయి. అభ్యర్థులు ఉదయం 4 గంటలకే గ్రౌండ్‌కు చేరుకున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం బయోమెట్రిక్, తదితరాలు పూర్తయిన తర్వాత 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారిని ఎత్తు, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌కు అనుమతించారు.

విషాదం..

పోలీస్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో డిసెంబర్ 17న ఈవెంట్స్‌లో పాల్గొన్న ములుగు జిల్లా పందికుంట గ్రామానికి చెందిన బానోత్ రాజేందర్ 1600 మీటర్ల పరుగు పందెం అనంతరం అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రెండు రోజుల తర్వాత రాజేందర్ మృతి చెందడంతో విషాదం నెలకొంది.


అభ్యర్థి షాట్‌పుట్‌ను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

పరీక్షలు పూర్తి పారదర్శకం..

పోలీస్ ఫిజికల్ ఈవెంట్స్ పూర్తిగా పారదర్శకంగా జరిగాయి. అభ్యర్థులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశాం. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో అభ్యర్థులు ఈవెంట్స్‌ను విజయవంతంగా ముగించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలందించారు. వారితోపాటు పరిపాలనా విభాగం, టెక్నికల్, వైద్య సిబ్బంది ఈవెంట్స్‌లో పాలుపంచుకున్నారు. వారందరికీ అభినందనలు.

- సీపీ ఏవీ రంగనాథ్

ఉద్యోగమే లక్ష్యంగా..


పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఫిజికల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించడానికి నెల రోజులు కష్టపడ్డాను. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం గ్రౌండ్‌కు వెళ్లి సాధన చేశాను. తుది పరీక్షకు అర్హత సాధించడం సంతోషంగా ఉంది.

- సౌజన్య, బుత్తవానిగూడెం

నెల రోజులుగా గ్రౌండ్‌కే పరిమితం


కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన తర్వాత సుమారు నెల రోజుల పాటు గ్రౌండ్‌కే పరిమితమయ్యాను. ఉదయం, సాయంత్రం కఠోర శ్రమ చేశాను. ఎట్టకేలకు ఫిజికల్ ఈవెంట్లలో అర్హత సాధించాను.

- ఇర్ప అనూష, పాకాల కొత్తగూడెం

పోలీస్ కొలువంటే ఇష్టం..


బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం ఎంటెక్ చదువుతున్నాను. పోలీస్ కొలువంటే ఇష్టం. కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించి ఫిజికల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించేందుకు రెండు నెలలు గ్రౌండ్‌లో కష్టపడ్డాను. దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించడం సంతోషంగా ఉంది.

- ఎట్టి శ్రీను, వాజేడు వెంకటాపూర్

ఎలాగైనా ఉద్యోగం సాధిస్తా..


పోలీస్ కావాలన్నది నా జీవిత లక్ష్యం. ఎలాగైనా ఉద్యోగం సాధించి తీరుతాను. ఫిజికల్ ఈవెంట్ల కోసం నెల రోజులుగా ప్రతి రోజు తీవ్రంగా కష్టపడ్డాను. తుది రాత పరీక్షకు కూడా కష్టపడి చదివి అర్హత సాధిస్తాను. పోలీస్ ఉద్యోగం సాధించి సమాజానికి సేవ చేస్తా.

- స్వర్ణపాక రాహుల్, గోవిందరావుపేట

కష్టానికి ఫలితం దక్కింది..


సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలన్నది నా లక్ష్యం. ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించి ఈవెంట్స్‌ను విజయవంతంగా పూర్తి చేశా. నెల రోజులు పడిన కష్టానికి ప్రతిఫలం దక్కింది. తుది పరీక్షకు కష్టపడి చదివి ఉద్యోగం సాధిస్తాను.

- ఎలింద్ర గట్టి, తిమ్మాపూర్

నిమిషం ఆలస్యం.. పరీక్షకు నో ఎంట్రీ

● అభ్యర్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

హసన్‌పర్తి: నిమిషం ఆలస్యంగా రావడంతో పది మంది అభ్యర్థులు పరీక్ష రాయలేకపోయారు. వివరాలిలా ఉన్నాయి. టీఎస్‌పీఎస్‌సీ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా సీడీపీఓ ఉద్యోగాలకు సంబంధించిన రాత పరీక్ష నిర్వహించింది. ఉదయం పేపర్ - 1, మధ్యాహ్నం పేపర్- 2 నిర్వహణకు అంతా సిద్ధం చేశారు. అయితే, ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా, 45 నిమిషాల ముందే అభ్యర్థులు సెంటర్‌కు చేరుకోవాలని నిబంధన విధించారు. భీమారం ఔటర్ రింగ్ సమీపంలో ఉన్న ఓ ఆన్‌లైన్ సెంటర్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. కాగా, ఈ సెంటర్‌లో పరీక్ష రాసే పది మంది అభ్యర్థులు ఒక నిమిషం ఆలస్యంగా కేంద్రానికి చేరుకున్నారు. దీంతో సెంటర్ నిర్వాహకులు వారిని పరీక్ష రాయడానికి అనుమతించలేదు. ఈ క్రమంలో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. పలువురు కన్నీళ్లు పెట్టుకున్నారు. హాల్ టికెట్‌లో సెంటర్ అడ్రస్ సరిగా పేర్కొనకపోవడం వల్లే కొంత జాప్యం జరిగిందని బాధిత అభ్యర్థులు పేర్కొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న నలుగురిపై కేసు

కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న నాలుగు ద్విచక్రవాహనాలను సీజ్ చేసి యజమానులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోకుండా రహదారులపై తిరుగుతున్న నలుగురిని మంగళవారం పట్టుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు వారిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బతికుండగానే చంపేశారు..!

● గ్రామ పంచాయతీ అధికారుల నిర్వాకం
● లబోదిబోమంటున్న పింఛన్‌దారులు


చిర్ర సారమ్మ

ఏటూరునాగారం: ఆసరా పింఛన్ పొందుతూ కాలం వెళ్లదీస్తున్న ముగ్గురు వృద్ధులను ఏటూరునాగారం గ్రామ పంచాయతీ అధికారులు బతికుండగానే చంపేశారు. ఎంపీడీఓ కార్యాలయానికి చనిపోయినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. దీంతో వారికి పింఛన్ రాక లబోదిబోమంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. ప్రతి నెల గ్రామ పంచాయతీ ద్వారా మరణ వివరాలను ఎంపీడీఓ కార్యాలయానికి అందించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పంచాయతీ అధికారులు మండల కేంద్రానికి చెందిన మహ్మద్ బిస్మిల్లా, చిర్ర సారమ్మ, మామిడి నర్సమ్మలు చనిపోయినట్లు గత ఏడాది నవంబర్‌లో జాబితా అందజేశారు. అప్పటి నుంచి వారికి ఆసరా పింఛన్‌లు రావడం లేదు. దాంతో ఆందోళన చెందిన వారు ఎంపీడీఓను కలిసి గోడు వెలబుచ్చారు. ఖంగుతిన్న ఎంపీడీఓ ముగ్గురి వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల తప్పిదం జరిగిందని గుర్తించాడు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో తిరిగి ముగ్గురికి పింఛన్ మంజూరు చేయాలని ఎంపీడీఓకు డిసెంబర్ 15న గ్రామ పంచాయతీ కార్యదర్శి చెన్న రంజిత్‌కుమార్ లేఖ పంపారు. ప్రస్తుతం ఆయన మరో చోటుకు బదిలీ అయ్యారు. అయితే, ఇరుగు పొరుగు వారి నుంచి తప్పుడు సమాచారం రావడం వల్లే డెత్ లిస్టులో ఇలా జరిగిందని కార్యదర్శి లేఖలో పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పింఛన్ రాక ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా పింఛన్ వచ్చేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

చేపల వేటకు వెళ్లి..

● విద్యుదాఘాతంతో యువకుడి మృతి


కిరణ్ (ఫైల్)

వర్ధన్నపేట: చేపల వేటకు వెళ్లిన యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రాంధన్‌తండాలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ రఘుపతి - విజయ దంపతులకు కుమారుడు కిరణ్(19), కూతురు ఐశ్వర్య ఉన్నారు. రఘుపతి వ్యవసాయం చేస్తూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కిరణ్ తండ్రితో కలిసి మంగళవారం నల్లబెల్లి చెరువు నుంచి వచ్చే వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలను వేటాడేందుకు వాగులో విద్యుత్ తీగ అమర్చారు. అది ప్రమాదవశాత్తు కిరణ్‌కు తగలడంతో తండ్రి రఘుపతి కుమారుడిని బయటకు తీశాడు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడి తండ్రి రఘు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మున్నేరువాగు దాటుతూ ఒకరి మృతి


వెంకన్న (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మున్నేరువాగు దాటుతూ ప్రవాహంలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. మహబూబాబాద్ రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఉప్పలపాడు గ్రామ పరిధి గొల్లగుడెంకు చెందిన బండి వెంకన్న(50), మరో వ్యక్తి నరాల ఐలయ్య కలిసి బంధువులకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ నెల 1వ తేదీన మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. వైద్యులకు చూపించిన అనంతరం ఇద్దరు ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి గాంధీపురం సమీపంలో గల మున్నేరువాగు మీదుగా గొల్లగూడెం వెళ్దామనుకున్నారు. అది వాగు మీదుగా ఉప్పలపాడుకు వెళ్లేందుకు దగ్గరి దారి అవుతుందని నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వెంకన్న కొట్టుకుపోయాడు. ఈ విషయాన్ని ఐలయ్య గుర్తించలేదు. వెంకన్న ఇంటికి రాకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. ఐలయ్యను అడగగా ఆయన నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. అనుమానంతో మృతుడి కుటుంబ సభ్యులు మంగళవారం మున్నేరువాగు వద్ద గాలించారు. ఈ క్రమంలో నీటిపై తేలియాడుతూ వెంకన్న మృతదేహం కనిపించింది. మృతుడి భార్య ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

జనగామ రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. జనగామ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన ఇరుగు అరవింద్(22) ప్రేమ వ్యవహారం విషయంలో డిసెంబర్ 26న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

ప్రాణం తీసిన గెట్టు పంచాయితీ

● ఓ రైతు దారుణ హత్య..
● పారతో తలపై మోది.. బావిలో పడేసిన మరో రైతు
● వరంగల్ జిల్లాలో ఘటన


పెద్ద రాజు (ఫైల్)


హత్యకు కారణమైన గెట్టు ఇదే


రోదిస్తున్న రాజు భార్య, కుమార్తెలు

చెన్నారావుపేట: గెట్టు పంచాయితీ ఓ రైతు ప్రాణం తీసింది. ఇద్దరు రైతుల మధ్య నెలకొన్న భూవివాదంలో మాటామాటా పెరిగి ఓ రైతు తన చేతిలో ఉన్న పారతో మరో రైతు తలపై మోదాడు. చనిపోయాక బావిలో తోసేశాడు. ఈ దారుణం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామంలో మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన జంగిలి పెద్ద రాజు(45)కు గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉంది. అతని భూమి పక్కనే దాసరి మార్కెండేయ అనే రైతుకు భూమి ఉంది. ఇద్దరికి భూమి హద్దు విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం జంగిలిపెద్ద రాజు రోజువారీగానే పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ హద్దుల విషయంలో రాజు, మార్కెండేయల మధ్య గొడవ జరగుతుండగానే మార్కెండేయ తన చేతిలో ఉన్న పారతో రాజు తలపై మోదాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు ఎవరూ లేకపోవడంతో రాజు మృతదేహాన్ని మార్కెండేయ పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో తోసివేసి ఏమి తెలియనట్లుగా ఇంటికి వెళ్లాడు. రాత్రి పది దాటినా రాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వారితో కలిసి వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయాన్నే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అనుమానంతో రాజు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వెతికారు. బావి వద్ద రక్తపు మరకలను గుర్తించారు. అందులో మృతదేహాన్ని వేసి ఉండవచ్చనే అనుమానంతో బావిలోని నీటిని మోటార్ల సహాయంతో తోడించగా మృతదేహం బయటపడింది. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. మృతుడి ఇద్దరు కుమార్తెలు శ్రావణి, స్రవంతి ఉన్నారు.

మృతుడి బంధువులు ఆందోళన..

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులతో కలిసి బంధువులు, కుటుంబ సభ్యులు మంగళవారం నిందితుడు మార్కెండేయ ఇంటి ఎదుట బైఠాయించారు. సంఘటనా స్థలానికి నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని నెక్కొండ -గూడూరు ప్రధాన రహదారి గుండా తరలిస్తుండగా లింగగిరి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకున్న బంధువులు, గ్రామస్తులు మరోమారు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లను ఉంచి తక్షణమే న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. పోలీసులు ఎంత చెప్పినా ఆందోళన విరమించకపోవడంతో ఏసీపీ మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతదేహాన్ని తరలించి ఆందోళన విరమింపజేయించారు.

షమితకు సావిత్రిబాయి పూలే పురస్కారం


అవార్డుకు ఎంపికైనట్లు షమితకు పత్రం అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం ప్రొఫెసర్ జి.షమిత సావిత్రిబాయి పూలే పురస్కారానికి ఎంపికైంది. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి మదర్ ఫౌండేషన్ వారు పదేళ్లుగా ఈ పురస్కారాలను అందజేస్తున్నారు. ఈ మేరకు ఆడపిల్లల చదువు, విద్యార్థుల విద్యాభివద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి పాటుపడుతున్న షమితను సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ బాధ్యులు మంగళవారం తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో షమితకు అవార్డు అందజేయమన్నట్లు పేర్కొన్నారు. అవార్డుకు ఎంపికైనట్లు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు పత్రం అందజేశారు. కార్యక్రమంలో మదర్ ఫౌండేషన్ సలహాదారు ప్రొఫెసర్ గణపతి శర్మ, రాష్ట్ర వైద్య కన్వీనర్ డాక్టర్ పాంచాల్‌రాయ్, శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ అమరేష్, తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జక్కు భిక్షపతి, టీఆర్‌ఎస్వీ కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, అధ్యాపకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులతో భర్తీ చేయాలి

● టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎదుట 2018 జేఎల్‌ఎం అభ్యర్థుల ధర్నా



టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అభ్యర్థులు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్‌మెన్ పోస్టులను అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయాలని 2018లో జేఎల్‌ఎం పరీక్ష రాసిన అభ్యర్థులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల నుంచి తరలివచ్చిన అభ్యర్థులు మంగళవారం హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో 2,553 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కాగా, అదే ఏడాది ఏప్రిల్ 8న రాతపరీక్ష నిర్వహించారని వివరించారు. అనంతరం 3 విడతలుగా 2019లో పోల్ టెస్ట్ నిర్వహించారని, అందులో కొంతమంది అర్హత సాధించకపోవడంతో 253 పోస్టులు మిగిలిపోయాయని వివరించారు. అయితే, పోస్టులు ఖాళీగా ఉన్నా నాలుగో జాబితా విడుదల చేసి భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మిగిలిన పోస్టులను మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని సుప్రీం కోర్టు కూడా గతంలో ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. దీంతో 14 మందికి ఉద్యోగావకాశాలు కల్పించి మిగతా వారిని పట్టించుకోవడం లేదని వాపోయారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను ఇప్పటికైనా అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరారు. ధర్నాలో అభ్యర్థులు ప్రవీణ్, రాజేందర్, కుమార్, కుమారస్వామి, శ్రీనివాస్, నాగరాజు, నరేష్, రాంకిషన్, తిరుపతి, సంతోష్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో వ్యక్తిపై పీడీ యాక్ట్

ధర్మసాగర్: ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై గంజాయి కేసులో పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు కాజీపేట ఏసీపీ పి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన పలువురు వ్యక్తులపై గత ఏడాది కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో ఏ3గా ఉన్న రాథోడ్ కాశీనాథ్‌పై వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు. కార్యక్రమంలో ధర్మసాగర్ సీఐ ఒంటేరు రమేష్, ఎస్‌ఐ సాయిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగపై..

గీసుకొండ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడిన మహ్మద్ యాకూబ్‌పాషాను గతేడాది సెప్టెంబర్‌లో గీసుకొండ పోలీసులు అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలించారు. తాజాగా సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం అతడిపై పీడీ యాక్ట్ నమోదు చేసి ఖమ్మం జైలు నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ అపహరణ

వరంగల్ రూరల్: వరంగల్ ములుగు రోడ్డు సబ్‌డివిజన్ ఆరేపల్లి సెక్షన్‌లో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఏనుమాముల ఎస్సై రాజన్‌బాబు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద ఆరేపల్లి మారుతీ హోటల్ సమీపంలో అమర్చిన 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను నవంబర్ 12, 15వ తేదీల్లో తనిఖీ చేసేందుకు అధికారులు వెళ్లారు. ఈ క్రమంలో అందులోని కాపర్ వైర్, ఆయిల్‌ను దొంగలు అపహరించినట్లు గుర్తించారు. దీంతో తాజాగా ఎన్పీడీసీఎల్ ఆరేపల్లి సెక్షన్ ఏఈఎం దిలీప్‌కుమార్, కొమురయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.